సాక్షి
నంద్యాల
ఆదివారం । 7 । జూలై । 2024



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళారాధన వేదికపై శనివారం వరంగల్‌కు చెందిన నిధి నృత్య కళాక్షేత్రం వారి కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం టెంపుల్: నిత్య అన్నదాన పథకానికి శనివారం విజయవాడకు చెందిన పి.శ్రీనివాసరావు రూ.1,11,111 విరాళాన్ని పర్యవేక్షకులు నాగరాజుకి అందజేశారు.



టీబీ డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో

హొళగుంద: తుంగభద్ర డ్యాంకు శనివారం ఇన్‌ఫ్లో 25,556 క్యూసెక్కుల నుంచి 46,300 క్యూసెక్కులకు పెరిగింది. డ్యాంలో 17 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

న్యూస్‌రీల్

మద్దిలేటయ్య క్షేత్రాభివృద్ధికి రూ. లక్ష విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాతలు

బేతంచెర్ల: ఆర్‌ఎస్ రంగాపురం శివార్లలో వెలసిన శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి చాగలమర్రి మండలం చింతలచెర్వు గ్రామానికి చెందిన ఎద్దుల జయరామిరెడ్డి, జయలక్ష్మి దంపతులు శనివారం రూ.1,00,116 విరాళాన్ని అంజేశారు. దాతలకు స్వామి, అమ్మవార్ల ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి స్వామి వారి పట్టు వస్త్రంతో సత్కరించారు. ఆషాఢ మాసం శనివారం సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వార్లకు అభిషేకం, కుంకుమార్చన, వరపూజ, ఆకుపూజ, నిర్వహించుకున్నారు.

జగజ్జననీకి సారె సమర్పణ



ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో వెలసిన జగజ్జననీ అమ్మవారికి ఆషాఢ మాసం మొదటి రోజు శనివారం సందర్భంగా వివిధ గ్రామాల భక్తులు సారె సమర్పించారు. దుర్గా యూనిట్స్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, పూజలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో అలంకరించారు. సామూహిక రాహుః కాల పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పుట్టింటి పట్టుచీర, సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

చిరుతను బంధించేందుకు బోన్లు

మహానంది: మహానంది ఆలయ పరిసరాల్లో సంచరిస్తున్న చిరుతను బంధించేందుకు అటవీ అధికారులు చర్యలు చేపట్టారు. పది రోజులుగా రాత్రి వేళ స్థానిక గోశాల ప్రాంగణం, పార్వతీపురం కాలనీల్లో తిరుగుతున్న చిరుత తాజాగా శనివారం దేవస్థానం కాలనీలోని ఉద్యోగి లక్ష్మయ్య ఇంటి పరిసరాల్లో మరోసారి కనిపించడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిరుత సంచారంతో స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తుందో అని భయాందోళనలతో భయంభయంగా కాలం వెళ్లదీస్తున్నారు. సుమారు పది రోజుల నుంచి సంచరిస్తున్నా అటవీశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో చిరుతపులిని బంధించేందుకు అధికారులు రెండు బోన్లను మహానందికి తెప్పించారు. మహానందిలోని పర్యావరణ కేంద్రం వద్ద అందుబాటులో ఉంచారు. ఎన్‌ఎస్‌టీఆర్, అటవీశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేస్తే ఓ ప్రత్యేక బోనులో ఒక జీవిని ఎరగా పెట్టి బంధించేందుకు ఏర్పాట్లు చేయనున్నారు.



ఉచిత వ్యాపారం!



గత ప్రభుత్వ హయాంలో..

కర్నూలు ఎ.క్యాంపునకు చెందిన రామకృష్ణకు ఇసుక కావాలంటే డోన్ రోడ్డులోని కార్బైడ్ ఫ్యాక్టరీ సమీపంలోని ఇసుక స్టాక్ పాయింట్‌కు వెళ్లేవారు. టన్నుకు రూ.475 చొప్పున ఒక టిప్పర్ ఇసుక (18 టన్నులు)కు రూ.8,550 చెల్లించేవారు. ఎ.క్యాంపు నుంచి స్టాక్ పాయింట్ నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. టిప్పర్‌కు రూ.3వేల నుంచి రూ.5వేల బాడుగ చెల్లించినా రూ.11,550 నుండి రూ.13,500 ఖర్చు వచ్చేది. కర్నూలు మాత్రమే కాదు.. నియోజకవర్గానికి ఒక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేశారు. ఏ నియోజకవర్గానికి చెందిన వారు ఆ ప్రాంతంలోని ఇసుక తీసుకునేవారు.

చంద్రబాబు ప్రభుత్వంలో..

మంత్రాలయం సమీపంలోని గుడికంబాళిలో మాత్రమే ఇసుక తెచ్చుకోవాలి. సి.బెళగల్‌లో ఇసుక తవ్వేందుకు అనుమతులు లేవు. ఇక్కడ ఇసుక కావాలంటే టన్నుకు రూ.335 చెల్లించేలా ప్రభుత్వం శనివారం నిర్ణయం తీసుకుంది. రేపటి నుంచి ఈ ప్రకారం ఇసుకను విక్రయించనున్నారు. కర్నూలు జిల్లాలో ఏ ప్రాంతం వారైనా సరే ఇసుక కావాలంటే గుడికంబాళి వెళ్లాల్సిందే. ఒక టిప్పర్ (18 టన్నులు)కు టన్నుకు రూ.335 చొప్పున రూ.6,030 ప్రభుత్వానికి చెల్లించాలి. ఇది కాకుండా రవాణాచార్జీలు అదనం. కర్నూలు నుంచి గుడికంబాళి 131 కిలోమీటర్ల దూరంలో ఉంది. కనీసం రూ.15వేల నుంచి రూ.20వేలు రవాణా చార్జీలు చెల్లించాలి. అంటే ఒక టిప్పర్ రూ.21,030 నుంచి రూ.26,030 వరకు ఖర్చవుతుంది.

ప్రజల కళ్లలో 'ఇసుక'

- ఉచితంగా ఇస్తామని ఎన్నికల్లో చంద్రబాబు, పవన్ హామీ
- రేపటి నుంచి ఉచిత ఇసుక అమలు చేస్తున్నట్లు ప్రకటన
- టన్నుకు రూ.335 చెల్లించేలా ప్రభుత్వ నిర్ణయం
- మంత్రాలయం సమీపంలోని గుడికంబాళి నుంచి మాత్రమే ఇసుక రవాణా
- రవాణా ఛార్జీలతో కలిపితే గతంలో కంటే ఎక్కువ ఖరీదు
- గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గానికి ఒక స్టాక్ పాయింట్
- ప్రభుత్వం ఏర్పడిన నెలరోజులకే మాట మార్చిన వైనం

సాక్షి ప్రతినిధి కర్నూలు: 'నోరు ఒకటి చెబుతుంది.. చెయ్యి ఒకటి చేస్తుంది. దేని దోవ దానిదే' అన్నట్లుగా ఉంది కూటమి ప్రభుత్వం తీరు. అలవికాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన చంద్రబాబు నెల రోజుల పాలనలో హామీలను తుంగలో తొక్కేలా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో 'ఉచిత ఇసుక'కు మంగళం పాడారు. ఎన్నికలకు ముందు ఉచితంగా ఇసుకను అందిస్తామని చెప్పి ఇప్పుడు టన్నుకు రూ.335 చెల్లించేలా ధరను నిర్ణయించారు. గత ప్రభుత్వం టన్నుకు రూ.475 నిర్ణయించింది. గత ప్రభుత్వాని కంటే ఇప్పుడు ప్రభుత్వం టన్నుపై రూ.140 తగ్గించింది. అయితే గత ప్రభుత్వం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఇసుకను అందుబాటులో ఉంచితే, ఈ ప్రభుత్వం మంత్రాలయంలోని గుడికంబాళిలో మాత్రమే విక్రయిస్తోంది. దీంతో రవాణాఖర్చులు లెక్కిస్తే గతం కంటే ఇసుక ఖర్చు రెట్టింపు కానుంది.

భవిష్యత్తులో సి. బెళగల్ నుంచి మరో రీచ్

ప్రస్తుతం గుడికంబాళి రీచ్‌కు వెళ్లి ఇసుక తెచ్చుకోవాలి. ఇది కాకుండా సి.బెళగల్ మండలంలోని కొత్తకోట, కె.సింగవరం, ఈర్లదిన్నె, ముడుమాల, పల్లెదొడి రీచ్‌ల నుంచి కూడా అనుమతి ఇస్తారు. ప్రస్తుతం వీటికి పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు అనుమతి లేదు. అనుమతులు వస్తే సి.బెళగల్ మండలంలోని రీచ్‌ల నుంచి తవ్వకాలు సాగించనున్నారు. లేదంటే గుడికంబాళి మాత్రమే దిక్కు. ఆదోని నుంచి కర్నూలు దాకా ఎవ్వరికి ఇసుక కావాలన్నా గుడికంబాళి వెళ్లాలి. రవాణా ఖర్చులు ఎంత భారమవుతాయో ప్రభుత్వం ఆలోచించలేదు.

ఇంటి నిర్మాణాలకు మినహాయింపు లేదు

గత ప్రభుత్వ హయాంలో జగనన్న ఇళ్లతో పాటు సొంతంగా ఎవరైనా ఇల్లు నిర్మించుకున్నా, ప్రభుత్వ పరిధిలోని నాడు–నేడు అభివృద్ధి పనులకు ఉచితంగా ఇసుక ఇచ్చారు. వినియోగదారుడు రెవెన్యూ అధికారులతో లెటర్ తీసుకుని రీచ్‌ల వద్ద ఉచితంగా ఇసుక తవ్వుకుని తీసుకెళ్లేవారు. టన్నుకు రూ.475 ప్రకారం నిర్ణయించిన ధరలో రూపాయి చెల్లించేవారు కాదు. కానీ ఇప్పుడు ఇంటి నిర్మాణాలకు కూడా ఉచితం లేదు. టన్నుకు రూ.335 చెల్లించి 131 కిలోమీటర్లు వెళ్లి ఇసుక తెచ్చుకోవాల్సిందే!

టన్నుకు రూ.335 ధర నిర్ణయం

రేపటి నుంచి ప్రభుత్వం 'ఉచిత ఇసుక' పేరుతో విక్రయాలు చేపట్టనుంది. దీనిపై శనివారం కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ కృష్ణకాంత్, మైనింగ్ డీడీ రాజశేఖర్, ఆర్డీవోతో డీఎల్‌ఎస్ సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో తవ్విన 29,351 మెట్రిక్ టన్నుల ఇసుక కౌతాళం మండలం గుడికంబాళిలో ఉంది. దీన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని విక్రయించనుంది. ఆపై గుడికంబాళిలో నది నుంచి ఇసుకను తవ్వి విక్రయించున్నారు. ఇసుక తవ్వకం, లోడింగ్, ట్రాన్స్‌పోర్ట్, సీనరేజ్, డిస్ట్రిక్ మినరల్ ఫండ్, జీఎస్టీల కింద ధరను రూ.335లుగా నిర్ణయించారు. జిల్లాలో ఎవరికి ఇసుక కావాలన్నా ఈ పాయింట్‌కు వెళ్లి, నిర్ణీత మొత్తం చెల్లించి, రవాణా ఖర్చులు భరించి తెచ్చుకోవాలి. తామే టిప్పర్ లేదా ట్రాక్టర్ నదిలోకి తీసుకెళ్లి తవ్వుకుని తెచ్చుకుంటామంటే దానికి అనుమతి లేదు. కచ్చితంగా గుడికంబాళిలో మాత్రమే తెచ్చుకోవాలి. ఇసుక ఉచితం అన్నప్పుడు జిల్లాలో ఎక్కడ ఇసుక అందుబాటులో ఉంటే అక్కడ ప్రజలు వెళ్లి ట్రాక్టర్లతో తవ్వుకుని తెచ్చుకుంటారు. దీనికి అనుమతి లేదంటే 'ఉచిత ఇసుక' ఎలా అవుతుందో ప్రభుత్వం సమాధానం చెప్పాలి.

నంద్యాల జిల్లాకూ గుడికంబాళి నుంచే!

నంద్యాల: జిల్లాలో ఇసుక నిల్వలు, స్టాక్ పాయింట్‌లు లేని కారణంగా సమీప జిల్లాలైన కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల నుంచి రవాణా చేసుకోవాల్సి ఉంటుందని ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఉచిత ఇసుక విధానం అమలుపై అడిషనల్ ఎస్పీ ప్రవీణ్ కుమార్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తోందన్నారు. స్టాక్ పాయింట్ నుంచి లోడింగ్, రవాణా చార్జీలు వినియోగదారుడే భరించాల్సి ఉంటుందన్నారు. నంద్యాల జిల్లాలో ప్రతిరోజు 5వేల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరం అవుతుందన్నారు. కర్నూలు జిల్లా కౌతాళం మండలంలోని గుడి కంబాలి స్టాక్ పాయింట్, కడప జిల్లా కొండాపురం మండలంలోని కె.వెంకటాపురం, పి.అనంతపురం, సిద్దవటం మండలంలోని జ్యోతి, వినేస్‌పల్లి మండలంలోని ఎర్రబల్లి స్టాక్ పాయింట్‌ల నుంచి ఉచిత ఇసుకను వినియోగదారులు రవాణా చేసుకోవాల్సి ఉంటుందన్నారు. డీజీఎం పోర్టల్‌లో లాగిన్ అయితే స్టాక్ పాయింట్‌లలో ఉన్న ఇసుక నిలువలు కనిపిస్తాయన్నారు. ఇసుక తరలించే వాహనాల మాన్యువల్ పర్మిట్‌లను తనిఖీ చేయాలని పోలీసు అధికారులను సూచించారు. సమావేశంలో గనుల శాఖ ఏడీ రామచంద్ర, నంద్యాల ఆర్‌డీఓ మల్లికార్జున రెడ్డి, డీటీసీ శివారెడ్డి, కేసీ కెనాల్ ఈఈ తిరుమలేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు

కర్నూలు(టౌన్): నూతన ఇసుక విధానంలో భాగంగా ప్రతి రోజు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇసుక సరఫరా చేస్తామని జిల్లా గనులు, భూగర్భశాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ తెలిపారు. ఇసుక డిపో వద్ద వాహనాలను క్యూలైన్ ప్రకారం మొదటి ప్రాధాన్యతగా అనుమిస్తామన్నారు. రవాణా సమయం, డిపోలో జారీ చేసిన రాయల్టీ రవాణా పత్రంలో నమోదు చేసిన పరిమాణం కంటే ఎక్కువ మోతాదులో ఇసుక రవాణ చేస్తే టన్నుకు రూ.2 వేలు జరిమానా విధిస్తామన్నారు. నిబంధనలు అతిక్రమించి ఇసుక బ్లాక్ మార్కెటింగ్, అనధికారిక నిల్వ చేస్తే రూ.2 లక్షలు జరిమానతో పాటు రెండేళ్ల జైలు శిక్ష తప్పదన్నారు. ఒక వినియోగదారుడికి రోజుకు 20 టన్నులు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు.

కనులపండువగా ఉత్తమోత్తమ స్నపన తిరుమంజనం



శాంతి హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు



తిరుమంజన సేవలో పీఠాధిపతి

ఆళ్లగడ్డ: ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రం దిగువ అహోబిలంలో అష్టబంధన మహా సంప్రోక్షణ పూజలు అహోబిలం పీఠాధిపతి శ్రీరంగరాజ యతీంద్ర మహాదేశికన్ స్వామీజీ ఆధ్వర్యంలో ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం వేదపండితులు సుప్రభాత సేవతో మూల మూర్తులను మేలుకొలిపి నిత్య పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం చతుస్థానార్చనం, పూర్ణాహుతి, శాత్తుమొర్రై, సాయంత్రం 473 కలశాలతో ఉత్సవమూర్తులకు ఉత్తమోత్తమ స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఈ పూజలు ప్రధానార్చకులు కిడాంబి వేణుగోపాలన్ ఆధ్వర్యంలో చేపట్టారు.

వరుణుడా .. నీవెక్కడా?

- 20 రోజులుగా జాడలేని చినుకు
- పదును వర్షం కోసం రైతుల నిరీక్షణ
- ఊపందుకోని ఖరీఫ్ సాగు

నంద్యాల(సెంట్రల్): నైరుతి రుతుపవనాలు జూన్ 2వ తేదీనే జిల్లాను పలకరించాయి. దీంతో విస్తారంగా వర్షాలు కురిశాయి. ఇక సకాలంలోనే పంటలు విత్తుకుంటామని అన్నదాతలు పొలాల్లో సేద్యానికి అడుగుపెట్టారు. జూన్ 18వ తేదీ వరకు వరుసగా రైతులను మురిపించాయి. ఆ తర్వాత వాతావరణ పరిస్థితులు పూర్తిగా మారాయి. అధికారులు వర్షసూచన ఉన్నట్లు చెబుతున్నా.. రోజూ మేఘాలు ఊరిస్తున్నా వాన జాడ కనిపించడం లేదు. 10 నుంచి 15 కిలోమీటర్ల వేగంతో గాలులు కూడా వీస్తున్నాయి. తుంపర్లు మినహా పదును వర్షం నమోదు కాలేదు. ముందస్తుగా వేసిన పంటలు గాలులు, ఎండకు వాడుతున్నాయి. అదునులో విత్తనం వేస్తామని భావించిన రైతులకు ఎదురు చూపులు తప్పడం లేదు. నంద్యాల జిల్లా జూన్ సాధారణ వర్షపాతం 76.8 మి.మీ కాగా నెల ముగిసేనాటికి 203 మి.మీ వర్షం కురిసింది. అంటే సాధారణం కంటే 126 మి.మీ అధిక వర్షపాతం నమోదైంది. జూన్ 15 నుంచి జూలై 15 వరకు ఖరీఫ్ పంటల సాగుకు సరైన సమయం. అయితే జూన్ 15 తర్వాత చినుకు జాడ లేదు. ఆ తర్వాత 11 రోజుల్లో కేవలం 2 మి.మీ వర్షపాతం నమోదు కావటం గమనార్హం. అయితే ఇంకా 10 రోజులు సమయం ఉన్నందున ఓ పదును వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నెల 15 వరకు విత్తుకు మంచి సమయమని, వర్షాలు ఇంకా ఆలస్యమైనా ఈ నెలాఖరు వరకు విత్తుకోవచ్చని అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీంతో సాగుపై రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఇంకా 7 శాతమే..

ఈ ఖరీఫ్‌లో జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 2.36 లక్షల హెక్టార్లుగా అంచనా వేశారు. అందులో ప్రధాన పంటలు వేరుశనగ, కంది, మొక్కజొన్న, మినుము, పత్తితో పాటు ఇతర చిరుధాన్యాలు, పప్పు ధాన్యాల పంటలు తదితర 15 రకాల పంటలు సాగులోకి రావాల్సి ఉంటుంది. అయితే ఇప్పటి వరకు కేవలం 7 శాతం అంటే దాదాపు 17 వేల హెక్టార్లలో పంటలు వేసినట్లు వ్యవసాయ శాఖ నివేదిక చెబుతోంది. సాధారణంగా ఈ సమయానికి 40 వేల హెక్టార్లకు మించి పంటలు వేసినట్లు చెబుతున్నారు. జూన్ 19 తర్వాత ఎక్కడా సరైన వర్షం లేకపోవటంతో సాగు ఆగిపోయింది. ఈ నెల 6న ఆరుద్ర కార్తె ముగిసి ఆ తర్వాత 20 వరకు పునర్వసు కార్తె ఉంటుంది. ఆ లోపు విత్తు పడితేనే అంతో ఇంతో పంట చేతికొస్తుందని రైతుల్లో నమ్మకం ఉంది. జూన్ నెలలో దాదాపు అన్ని మండలాల్లోనూ సాధారణం కన్నా అధికంగా వర్షాలు పడినా ఖరీఫ్ కదలిక లేకపోవడం విశేషం. ఇపుడు మంచి అదును కావడంతో పదును వర్షం పడాలని రైతులు కోరుకుంటున్నారు. జూలై నెల సాధారణ వర్షపాతం 141.2 మి.మీ నమోదు కావాల్సి ఉండటంతో వాన కోసం రైతులు నిరీక్షిస్తున్నారు.

రూ.15.44 లక్షల విలువైన విత్తన అమ్మకాలు నిలుపుదల



విత్తన శాంపిల్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు

నంద్యాల(అర్బన్): పలు విత్తన దుకాణాల్లోని సీడ్స్‌కు సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో దాదాపు రూ. 15.44 లక్షల విలువైన విత్తనాల విక్రయాలను విజిలెన్స్ అధికారులు నిలుపుదల చేశారు. పట్టణంలోని సాయి ఆగ్రో ఏజెన్సీస్, దుర్గా భవాని ఫర్టిలైజర్స్, రాయల్ ఆగ్రో ఏజెన్సీస్, గణపతి సీడ్స్, అన్నదాత సీడ్స్, రైతు మిత్ర ఆగ్రో ఏజెన్సీస్, కిరణ్ హైబ్రీడ్స్, దరణి సీడ్స్, జయ సాయి ఆగ్రో ఏజెన్సీస్, శ్రావణ ఆగ్రోసీడ్స్ విత్తన శుద్ధి కేంద్రాల్లో శనివారం వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు ఏక కాలంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. డీఏ సుబ్రమణ్యేశ్వరస్వామి, శ్రీనివాసరావు, విజిలెన్స్ అధికారులు సునీల్‌కుమార్, సిద్ధయ్య ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేనందున రూ.15.44 లక్షల విలువ చేసే విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేశారు. వారి వెంట ఏవో రాజశేఖర్, ఏఓ ప్రసాదరావు, వ్యవసాయాధికారులు అయూబ్‌బాషా, కల్యాణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కుంగుతున్న 'సాగు' ఆశలు!

- గోరుకల్లు జలాశయంలో నీటినిల్వ తగ్గించేందుకు చర్యలు
- కట్ట కుంగడంతో కొనసాగుతున్న పనులు
- ఎస్సార్బీసీ ఆయకట్టు కింద 1.92 లక్షల ఎకరాలు



కుంగిన గోరుకల్లు జలాశయం కట్ట (ఫైల్)



గోరుకల్లు రిజర్వాయర్

పాణ్యం: గోరుకల్లు జలాశయంలో ఈ ఏడాది నీటినిల్వ తగ్గించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి ఏటా 10 టీఎంసీల వరకు నిల్వ చేసేవారు. ఈ సారి అంత మోతాదులో కాకుండా రెండు టీఎంసీలు తగ్గించనున్నారు. గోరుకల్లు కట్ట కుంగిపోవడంతో అధికారులు మరమ్మతులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మరో ప్రదేశంలో కూడా కట్ట కుంగిపోయింది. దీంతో అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నారు. ఈ పనులు పూర్తి చేస్తే గోరుకల్లులో 8 టీఎంసీల వరకు నీరు నిల్వ చేసే అవకాశం ఉంది.

జలాశయ నేపథ్యమిదీ..

కరువు సీమ కృష్ణ జలాలను మళ్లించడంలో గోరుకల్లు ప్రాజెక్ట్ కీలకంగా ఉంది. సాగునీటి వసరుల్లేని ఉమ్మడి కర్నూలు జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు 1993 జనవరి 21వ తేదీన అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అయితే పనులు మొదలు కాలేదు. 2004లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞం పేరుతో గోరుకల్లుకు రూ.448.92 కోట్లు కేటాయించి పనులు పూర్తి చేయించారు. సీమకు తలమానికంగా ఉన్న ఈ జలాశయం పూర్తి సామర్థ్యం 12 టీఎంసీలు కాగా.. ఇక్కడి నుంచి 650 గ్రామాలకు తాగునీరు, ఎస్సార్బీసీ ఆయకట్టు కింద 1.92 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతోంది. జలాశయానికి చెందిన కట్ట కుంగిపోవడంతో పనులు చేస్తున్నారు.

ఇవీ సమస్యలు..

ఎస్సార్బీసీ కాలువ నుంచి బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల, పాణ్యం, దొర్నిపాడు, ఉయ్యాలవాడ మండలాలకు సాగునీరు అందాలి. గోరుకల్లులో నీరు నిల్వ చేయలేని పక్షంలో ఆయకట్టులో సాగు ప్రశ్నార్థకం కానుంది. జలాశయంలో నమ్మదగ్గా నీరు ఉంటేనే గాలేరుకు వదులుతారు. అలాగే డోన్ నియోజకవర్గానికి తాగునీటిని ఇక్కడి నుంచే అందించాల్సి ఉంది. గ్రీన్‌కో ప్రాజెక్టు, బనగానపల్లెలోని మహాసిమెంట్ ఫ్యాక్టరీకి నీటిని ఇక్కడి నుంచే సరఫరా చేయాల్సి ఉంది. జలాశయంలో మొదటిసారిగా 2017లో నీటిని నిల్వ చేశారు. ఈ క్రమంలో లీకేజీలు బయటపడ్డాయి. గోరుకల్లు గ్రామంలో ఎక్కడ తవ్వినా నీటి ఊటలు కనిపించాయి. అప్పట్లో రూ. 42కోట్లతో లోడెడ్‌కన్ పనులు చేపట్టారు. ఇటీవల జలాశయం కట్ట కుంగడంతో సమస్య మరింత తీవ్రమైంది. అధికారులు పనులు చకచకా చేస్తున్నా.. నీటి నిల్వపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సాగు కూడా ప్రశ్నార్థకంగా మారింది.

2017 నుంచి ఇప్పటి వరకు గోరుకల్లు జలాశయంలో నీటి నిల్వ వివరాలు..

సంవత్సరం	నిల్వ ఉంచిన నీరు (టీఎంసీల్లో)
2017	5.4
2018	8.22
2019	9.26
2020	9.14
2021	9.56
2022	10.73
2023	10.81

నీటి నిల్వ తగ్గిస్తాం



ఈ ఏడాది గోరుకల్లు రిజర్వాయర్‌లో నీటి నిల్వ తగ్గించాలని ఉన్నతాధికారులు సూచించారు. భద్రతా కారణాలతో పాటు కట్ట సమస్య పునరావృతం కాకుండా ఉండాలంటే నీటి నిల్వ తగ్గించడమే పరిష్కారం. గతంలో కట్ట కుంగిన తర్వాత పనులు పూర్తి చేసి 10 టీఎంసీలు నిల్వ చేశాం. ఈ సారి పనులు చేసిన తర్వాత అంత కంటే తక్కువ మోతాదులో నీటిని నిల్వ చేయనున్నాం.

– సుభకుమార్, ఈఈ, గోరుకల్లు

యునాని ఆసుపత్రిలో మందుల్లేవ్!

- వెనుదిరుగుతున్న రోగులు
- స్పందించని ఆయుష్ విభాగం



బనగానపల్లె ప్రభుత్వ యునాని వైద్యశాల

బనగానపల్లె: మారుతున్న జీవనశైలితో రోగాలు చుట్టుముడుతున్నాయి. అనారోగ్యాల కారణంగా జనం ఏళ్ల తరబడి అల్లోపతి మందులు వాడలేక సైడ్ ఎఫెక్ట్ లేని యునాని వైద్యం వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే ఆయుష్ విభాగం అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోగులకు మందులు అందడం లేదు. బనగానపల్లె పట్టణంలోని యునాని ఆసుపత్రి ఎంతో పేరుంది. బనగానపల్లె సంస్థానాన్ని పాలించిన నవాబుల కాలం నుంచే ఇక్కడ యునాని వైద్యం అందుబాటులో ఉంది. గతంలో ఈ ఆసుపత్రికి రోజుకు 100–150 మంది వరకు అవుట్ పేషెంట్లు వచ్చేవారు. పచ్చకామెర్లు, కీళ్ల నొప్పులు, గ్యాస్ ట్రబుల్‌తో పాటు స్త్రీలకు సంబంధించిన అన్ని రకాల జబ్బులకు మందులిచ్చే వారు. కాల క్రమేణ ఈ వైద్యశాల ఆదరణ కోల్పోయి అలంకార ప్రాయంగా నిలిచింది. అయితే మళ్లీ యునాని వైద్యానికి ఆదరణ పెరుగుతుండటంతో పలు చోట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యునాని వైద్యశాలలు అభివృద్ధి చేశారు. ఈ క్రమంలో బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు వైద్యులు, కాంపౌండర్‌ను నియమించారు. అయితే ఆయుష్ విభాగం అధికారులు మందుల సరఫరాలో నిర్లక్ష్యం వహించడంతో రోగులు వెనుదిరుగుతున్నారు. మందుల కొరత విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని వైద్యులు వాపోతున్నారు. ఈ విషయంపై ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ ఎండీ యూనస్‌ను వివరణ కోరగా.. త్వరలో మందులు వస్తే అవకాశం ఉందని, ఇక్కడికి వచ్చే రోగులను ఇతర ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నామన్నారు.

ఇంద్ర సర్వీసుల్లో 10 శాతం రాయితీ

నంద్యాల(వ్యవసాయం): బెంగళూరు, హైదరాబాద్ మధ్య తిరిగే ఇంద్ర ఏసీ సర్వీసు బస్సుల్లో ప్రయాణికులకు చార్జీల్లో 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ గంగాధర్ శనివారం తెలిపారు. ఈ అవకాశం ఈనెల 31వ తేదీ వరకు ఉందన్నారు.

క్లుప్తంగా

వ్యవసాయ శాఖ పథకాల పేర్లు మార్పు

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వం వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న వివిధ పథకాల పేర్లను మార్పు చేసింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ హరికిరణ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ-క్రాప్‌ను ఈ-పంట, వైఎస్సార్ రైతుభరోసా-పీఎం కిసాన్‌ను అన్నదాత సుఖీభవ, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు పథకాన్ని వడ్డీ లేని రుణాలు, డాక్టర్ వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా పథకాన్ని ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బివై), వైఎస్సార్ యంత్రసేవ పథకాన్ని ఫామ్ మెకనైజేషన్ స్కీమ్, డాక్టర్ వైఎస్ఆర్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లు, వైఎస్ఆర్ యంత్రసేవ కేంద్రాలను విలేజ్/క్లస్టర్ సీహెచ్‌సీలు, వైఎస్ఆర్ యాప్‌ను వీఏఏ పర్ఫార్మెన్స్ మానిటరింగ్ యాప్‌గా పేర్లు మార్పు చేసింది. ఇక నుంచి మార్పు చేసిన పేర్లను మాత్రమే వినియోగించాలని వ్యవసాయ యంత్రాంగాన్ని ఆదేశించారు.

మాస్టర్ ప్లాన్ ప్రకారమే అభివృద్ధి పనులు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం వద్ద వివిధ అభివృద్ధి పనులు మాస్టర్ ప్లాన్ ప్రకారమే చేపట్టాలని రాష్ట్ర దేవాదాయశాఖ స్థపతి పరమేశ్వరప్ప, అసిస్టెంట్ స్థపతి సుబ్రమణ్యం తెలిపారు. శనివారం వారు ఆలయ డిప్యూటీ కమిషనర్ హెచ్.జి. వెంకటేశ్‌తో కలిసి దేవాలయ సరిసరాల్లో పర్యటించారు. శ్రావణ మాసంలో వివిధ కౌంటర్లను ఎక్కడ ఏర్పాటు చేయాలన్న విషయంలో దేవాలయ అధికారులకు స్థపతి వివరించారు. శాశ్వత పనుల్లో భాగంగా మాడ వీధుల నిర్మాణం, పరిపాలనా కార్యాలయం, టిక్కెట్ కౌంటర్లు, ప్రసాదాల కౌంటర్లు, కల్యాణకట్టలు ఇలా వివిధ పనులను మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేయాలన్నారు. కార్యాలయంలో ఆయన మ్యాప్‌లను పరిశీలించి వివిధ పనులపై సమీక్షించారు. ఆయన వెంట డీఈ శ్రీనివాసులు, ఏఈలు రవికుమార్‌రెడ్డి, దేవేంద్రరెడ్డి, ప్రధాన అర్చకుడు వీరప్పస్వామి, ఆలయ పర్యవేక్షకులు, అర్చక సిబ్బంది ఉన్నారు.

పాముకాటుకు విద్యార్థి మృతి


లక్కీ (ఫైల్)

పెద్దకడబూరు: మండల పరిధిలోని నౌలేకల్లు గ్రామానికి చెందిన లక్కీ(8) అనే విద్యార్థి పాముకాటుకు గురై మృతి చెందాడు. లక్కీ, ఉసేని దంపతులకు మొదటి కుమారుడైన లక్కీ స్థానిక ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. అనారోగ్యంగా ఉండడంతో శనివారం ఉదయం లక్మీ కుమారుడు లక్కీని పాఠశాలకు వెళ్లమని చెప్పి ఆదోని హాస్పిటల్‌కు వెళ్లింది. అయితే లక్కీ పాఠశాలకు డుమ్మా కొట్టి స్నేహితులతో కలిసి పక్క వీధిలో రాళ్ల సమీపాన ఆడుకుంటుండగా పాము కాటు వేసింది. దీంతో గమనించిన స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బంధువులు ఆ బాలుడుని బసలదొడ్డి గ్రామానికి తీసుకెళ్లి నాటు వైద్యం చేయించారు. అక్కడ వారు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో ఆదోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. విషప్రభావం ఎక్కువ కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బాలుడు మృతి చెందాడు. పాఠశాలకు వెళ్లి ఉంటే తన కుమారుడు బతికి ఉండేవాడంటూ తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టిచ్చింది.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి


రమేష్(ఫైల్)

మంత్రాలయం: మంత్రాలయం సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రమేష్ (51) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం ఆదోని పట్టణంలోని శ్మశాన వాటికలో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

మధ్యాహ్న భోజన పథకంలో రాజకీయం

- వంట ఏజెన్సీల మార్పుతో గ్రామాల్లో ఘర్షణలు
- అభివృద్ధి పనుల బిల్లుల్లో ఎమ్మెల్యేల జోక్యం
- స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్పీటీసీ సభ్యులు
- గ్రామాల్లో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ ఆదేశం



హాజరైన జెడ్పీటీసీ సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో రాజకీయం చోటుచేసుకుందని పలువురు జెడ్పీటీసీలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇష్టానుసారంగా వంట ఏజెన్సీలను మార్పుతుండటంతో గ్రామాల్లో ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన స్థానిక జెడ్పీ మినీ సమావేశ భవనంలో శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన ఏడు స్థాయీ సంఘ సమావేశాలు సాయంత్రం 5 గంటల వరకు కొనసాగాయి. ఈ సమావేశాలకు ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన జెడ్పీటీసీ సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు. హౌసింగ్, వ్యవసాయం, పశు సంవర్ధకం, సంక్షేమం, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, ఆర్అండ్‌బీ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, నీటి పారుదల తదితర శాఖలపై సుదీర్ఘంగా చర్చించారు.

నిబంధనలకు విరుద్ధంగా వంట ఏజెన్సీల మార్పు

మంత్రాలయం నియోజకవర్గంలో నిబంధనలకు విరుద్ధంగా వంట ఏజెన్సీలను మార్పుతున్నారని కౌతాళం జెడ్పీటీసీ సభ్యురాలు యు రాధాప్రియదర్శిని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో గ్రామాల్లో ఘర్షణ వాతావరణం నెలకొని, హత్యలు కూడా జరిగే ప్రమాదం ఉందన్నారు. డోన్ నియోజకవర్గంలోని కొత్తకోట, చిన్నమల్కాపురం గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొందని జెడ్పీటీసీ సభ్యుడు బీ రాజకుమార్ తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో ఏవైనా లోపాలున్నా, అక్రమాలు జరుగుతున్నా, నిర్వహణ సరిగ్గా లేకపోయినా ... విద్యార్థులు, తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే సంబంధిత పాఠశాల హెచ్ఎం, ఎంఈఓ విచారించి చర్యలు తీసుకోవాల్సి ఉందని జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి తెలిపారు. ఇలాంటివేవి లేకుండా ఏకపక్షంగా ఏజెన్సీలపై చర్యలు తీసుకోవడం నిబంధనలకు విరుద్ధమన్నారు.

బిల్లులు చేయడం లేదు..

మండల, గ్రామ పంచాయతీ స్థాయిలో తీర్మానాలు చేసిన పనులను పూర్తి చేసినా బిల్లులు చేయడం లేదని జూపాడు బంగ్లా జెడ్పీటీసీ సభ్యుడు పీ జగదీశ్వరెడ్డి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని మండ్లెం గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైన్ల పనులు పూర్తి చేశారని, అయితే స్థానిక ఎమ్మెల్యే ఆదేశాలతో సంబంధిత అధికారులు బిల్లులు చేయడం లేదన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి జోక్యం చేసుకుంటు పూర్తి చేసిన పనులకు సంబంధించి వెంటనే ఎంబుక్ రికార్డు చేసి బిల్లులు చేయాలని అధికారులకు సూచించారు.

బిల్లులు పంపండి ...

జిల్లా పరిషత్ నిధులు రూ.1.08 కోట్లతో స్త్రీ శిశు సంక్షేమ శాఖకు సంబంధించి చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులను వెంటనే పంపించాలని జెడ్పీ చైర్మన్ ఆదేశించారు. ఈ నిధులతో జిల్లాలోని కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, అవుకు, పగిడ్యాల, నంద్యాల, కృష్ణగిరి, కర్నూలు తదితర ప్రాంతాల్లో పనులు చేపట్టారన్నారు. ఈ నెలాఖరు నాటికి బిల్లులను పంపాలని, లేని పక్షంలో ఆగస్టు 15వ తేదీలోగా పంపించాలన్నారు.

గ్రామాల్లో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి కోరారు. వర్షాకాలంలో తాగునీరు కలుషితం కాకుండా, అంటు వ్యాధులు ప్రబలకుండా జిల్లా పంచాయతీ, గ్రామీణ నీటి సరఫరా, వైద్య ఆరోగ్య శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. పశువుల అంబులెన్స్‌లు ఎన్ని ఉన్నాయి? వాటి పనితీరు ? వైద్యం, అందుబాటులో ఉన్న మందులు తదితర విషయాలను ఆయన వాకబు చేశారు. మండలాల్లో నిర్వహించే సర్వసభ్య సమావేశాలకు మండల స్థాయిల్లో విధులు నిర్వహించే అధికారులందరు తప్పక హాజరు కావాలన్నారు. ఇందుకు సంబంధించి ఎంపీడీఓలకు లేఖలు రాయాలని సీఈఓను కోరారు. సమావేశాల్లో జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు ఈ రంగనాథ్‌గౌడ్, ప్రసన్నకుమార్, బీ రాజ్‌కుమార్, సుంకన్న, సుధాకర్‌రెడ్డి, కేఈ సుభాషిణి, పీ మౌలాలి, షేక్ కరీమున్నీసా, యు రాధాప్రియదర్శిని, ఎం లింగప్ప, కేవీఆర్ మహేశ్వరరెడ్డి, పీ జగదీశ్వరరెడ్డి, బీ రఘునాథ్‌రెడ్డి, పీ అనసూయమ్మ, జీ శివశంకర్‌రెడ్డి, డీ మురళీధర్‌రెడ్డి, ఆయా ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు సిద్దలింగమూర్తి, జే రంగలక్ష్మిదేవి, వరలక్ష్మి, జాకీర్‌హుసేన్, డా.ప్రవీణ్‌కుమార్, శామ్యూల్, సునీల్ కన్నా, ఆర్ నాగరాజు, బీ శ్రీధర్‌రెడ్డి, సురేష్‌కుమార్, ఎస్‌సీఈ మద్దన్న, రామక్రిష్ణారెడ్డి, రామ్మోహన్, ఉమాపతి, శంకర్‌రెడ్డి, బీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖకు జాతీయస్థాయిలో పతకాలు


ఆర్ఎస్ఐ కల్పనను అభినందిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: జాతీయ పోలీస్ జుడో క్లస్టర్ ఆటల పోటీల్లో జిల్లా పోలీసు శాఖకు రెండు కాంస్య పతకాలు దక్కాయి. కర్నూలు ఆర్మ్‌డ్ రిజర్వు విభాగంలో ఆర్ఎస్ఐగా పనిచేస్తున్న కల్పన ఈ పతకాలు సాధించారు. శనివారం క్యాంపు కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్ ఆమెను అభినందించారు. జూన్ 24 నుంచి 30వ తేదీ వరకు అసోం రాష్ట్రం గౌహతిలో నిర్వహించిన 9వ జాతీయ పోలీస్ జుడో క్లస్టర్ ఆటల పోటీల్లో ఆంధ్రప్రదేశ్ పోలీస్ తరఫున కర్నూలు పోలీసు శాఖ నుంచి ఆర్ఎస్ఐ కల్పన పాల్గొని తైక్వాండోలో ఒక కాంస్యం, సిలాట్ పోటీల్లో ఒక కాంస్యం సాధించారు. భవిష్యత్తులో జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభను కనపరచి మరిన్ని పతకాలు సాధించి జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా ఎస్పీ కృష్ణకాంత్ ఆకాంక్షించారు. ఆర్ఐలు నారాయణ, జావెద్, ఆర్ఎస్ఐలు పావని, రవిశంకర్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై కేసు నమోదు

కొలిమిగుండ్ల: కోర్నపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లును దుర్భాషలాడిన టీడీపీ నాయకులపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. జూన్ 29వ తేదీన ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు విధుల్లో ఉండగా టీడీపీ నేత విజయభాస్కర్ రెడ్డి అక్రమంగా పాఠశాలలోకి ప్రవేశించి రేషన్ బియ్యం బస్తాలను నిల్వ ఉంచుకోవాలని హుకూం జారీ చేశాడు. పాఠశాలలో బియ్యం ఉంచేందుకు వీలుపడదని చెప్పడంతో ఆగ్రహంతో ఊగిపోయిన టీడీపీ నేత ఉపాధ్యాయుడిపై బూతులతో రెచ్చిపోయాడు. తన పట్ల ఇష్టానుసారంగా బూతులతో తిట్టడమేగాక దౌర్జన్యానికి దిగారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విజయభాస్కర్‌రెడ్డితో పాటు అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త దూదేకుల నడిపి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ గోవిందునాయక్ తెలిపారు.

పట్టపగలే ఆలయంలో చోరీ


సీసీ కెమెరాలో నిక్షిప్తమైన చోరీ దృశ్యం

ఆదోని అర్బన్: పట్టణంలోని బంగారుబజార్‌లో వెలిసిన శ్రీ కాళికా కమటేశ్వర దేవాలయంలో పట్టపగలే చోరీ జరిగింది. ఈ ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. శుక్రవారం యథావిధిగా పూజారులు ఉదయం అభిషేకం చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఆలయంలో దర్శనానికి వచ్చాడు. లలితాంబ చిన్న విగ్రహం మూర్తికి ఉన్న 3 గ్రాముల బంగారు తాళిబొట్టును దొంగలించాడు. దానిని జేబులో పెట్టుకొని బయటకు వెళ్లిన దృశ్యం సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యింది. ఆ సమయంలో పూజారి పక్కనే ఉన్న విగ్రహానికి అభిషేకం చేస్తున్నారు. వెంటనే దుండగుడు ఆలయంలో దూరి 3 గ్రాముల తాళిబొట్టును దొంగలించి పరుగుతీశాడు. శనివారం పూజారులు అమ్మవారి మెడలో తాళిబొట్టు లేదని గుర్తించి, సీసీ కెమెరాలను పరిశీలించారు. దుండగుడు శుక్రవారం ఉదయం దొంగలించినట్లు సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. ఈ విషయాన్ని ఆదోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆలయ పూజారులు ఫిర్యాదు చేశారు.

బేతంచెర్లలో..

బేతంచెర్ల: పట్టణంలోని సెయింట్ ఆన్స్ స్కూలు సమీపంలోని ఓ ఇంట్లో పట్టపగలే దొంగలు చోరీకి పాల్పడ్డారు. స్థానికంగా నివాసముంటున్న వర్క్‌షాపు వెంకటరమణ శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి తన కోడలు లక్ష్మి అరుణకు వైద్యం కోసం నంద్యాల శాంతిరాం ఆసుపత్రికి బయలుదేరారు. అతని కుమారుడు గిరిష్ కుమార్ సాయంత్రం 4గంటల ప్రాంతంలో వర్క్ షాపు నుంచి ఇంటికి చేరుకోగా ఇంటి తాళం పగుల గొట్టి ఉండటంతో అనుమానంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్ఐ శివశంకర్ నాయక్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని ఇంటిని పరిశీలించారు. రెండు బీరువా లాకర్లు పగుల గొట్టి అందులో ఉన్న 8.30 తులాల బంగారు ఆభరణాలు, రూ.1.30 లక్షల నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి, క్లూస్ టీంకు సమాచారం ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

జంతువుల నుంచి సోకే వ్యాధులపై అవగాహన అవసరం


రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ జి.శ్రీనివాస్

కర్నూలు(అగ్రికల్చర్): జంతువుల నుంచి సోకే వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కర్నూలులోని బహుళార్ధ పశువైద్యశాలలో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ ప్రారంభించారు. కర్నూలు నగరానికి చెందిన 70కిపైగా పెంపుడు కుక్కలు, పిల్లులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ మాట్లాడుతూ.. రేబిస్ టీకాలు వేయడం ప్రతి రోజూ జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీధి కుక్కల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి డాక్టర్ రాజశేఖర్, జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ రవిబాబు, బహుళార్థపశువైద్యశాల అసిస్టెంటు డైరెక్టర్లు సుధాకర్, చంద్రలీల, ధనుంజయుడు, ప్రాంతీయ శిక్షణ కేంద్రం ఏడీ సుధాకర్ రెడ్డి, జిల్లా గొర్రెల అభివృద్ధి విభాగం ఏడీ సుబాన్‌బాషా, వెటర్నరీ అసిస్టెంటు సర్జన్‌లు విజయభాస్కర్, విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విజిలెన్స్ తనిఖీలు

- రెండు రోజుల్లో రూ.138.6 లక్షల ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల అమ్మకాలు నిలిపివేత


కోడుమూరులో విత్తన దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాల్లో వేర్వేరు జిల్లాల నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలు తనిఖీలు ముమ్మరంగా చేపట్టాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ, విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కృష్ణా జిల్లా గన్నవరం ఏడీఏ శ్రీనివాసరావు, విజిలెన్స్ సీఐ రామకృష్ణ, పల్నాడు జిల్లా క్రోసూరు ఏడీఏ హనుమంతురావు, విజిలెన్స్ డీఈ చంద్రశేఖర్ తనిఖీలు కొనసాగిస్తున్నారు. రెండో రోజు 5 మండలాల్లో తనిఖీలు జరిగాయి. ఒక బృందం కోడుమూరు, గోనెగండ్ల, మరో బృందం కోసిగి, హొళగుంద, హాలహర్వి మండలాల్లో తనిఖీలు నిర్వహించాయి. తనిఖీల్లో భాగంగా రూ.54.14 లక్షల విలువ కలిగిన 38.14 క్వింటాళ్ల విత్తనాలు, రూ.2.64 లక్షల విలువ కలిగిన 1.14 మెట్రిక్ టన్నుల ఎరువులు, రూ.3.60 లక్షల విలువ కలిగిన 205.56 లీటర్ల పురుగు మందుల అమ్మకాలను నిలిపివేశారు. రెండు రోజుల్లో మొత్తంగా రూ.103.5 లక్షల విలువ కలిగిన విత్తనాలు, రూ.31.14 లక్షల విలువ కలిగిన ఎరువులు, రూ.3.96 లక్షల విలువ కలిగిన పురుగు మందుల అమ్మకాలను నిలిపివేశారు. మొత్తంగా రెండు రోజుల్లో రూ.138.6 లక్షల విలువ చేసే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులపై స్టాప్‌సేల్ ఇచ్చారు. తనిఖీల్లో ఏడీఏలు మహమ్మద్‌ఖాద్రి, సునీత, కోడుమూరు ఏవో రవిప్రకాశ్ పాల్గొన్నారు.

కోడుమూరులో..

కోడుమూరు రూరల్: విత్తన, పురుగుమందుల దుకాణాల్లో శనివారం వ్యవసాయ కమిషనర్ కార్యాలయం ఏడీఏ శ్రీనివాసరావు, కర్నూలు విజిలెన్స్ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. విత్తనాలు, పురుగు మందులకు సంబంధించిన స్టాక్ రిజిష్టర్లు, లైసెన్స్‌లను పరిశీలించారు. కోడుమూరులోని కిరణ్ హైబ్రిడ్ సీడ్స్ దుకాణంలో సరైన రికార్డులు లేని రూ.15,57,000 విలువ చేసే విత్తనాలను, రాఘవేంద్ర ట్రేడర్స్‌లో రూ.4,07,000 విలువ చేసే విత్తనాల అమ్మకాలను అధికారులు నిలిపేశారు. మొత్తం రూ.19.64లక్షలు విలువ చేసే విత్తనాల అమ్మకాలను నిలిపేసినట్లు కోడుమూరు ఏఓ రవిప్రకాష్ తెలిపారు. వీటికి సంబంధించిన రికార్డులను 30 రోజుల్లో దుకాణదారులు చూపించకపోతే సీజ్ చేసి కోర్టుకు సమర్పిస్తామన్నారు.

ఇక మండలానికి ఒక్క పొలంబడి మాత్రమే

- రెగ్యులర్ పొలంబడులకు స్వస్తి పలికిన ప్రభుత్వం

కర్నూలు(అగ్రికల్చర్): టీడీపీ కూటమి ప్రభుత్వం పొలంబడి కార్యక్రమాలకు మంగళం పలికింది. కొన్నేళ్లుగా ఖరీఫ్, రబీ సీజన్‌లలో జరుగుతున్న పొలంబడి కార్యక్రమాలు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతూ వచ్చాయి. ఆహార, నూనె గింజలు, వాణిజ్య పంటల్లో కూడా పొలంబడి కార్యక్రమాలు జరిగేవి. వైఎస్సార్‌సీపీ పాలనలో రెగ్యులర్‌గా నిర్వహించే పొలంబడులతో పాటు గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్(గ్యాప్) కింద ప్రత్యేక పొలంబడి కార్యక్రమాలు కూడా నిర్వహించడం విశేషం. పొలంబడి కార్యక్రమాలను విత్తనం మొలకెత్తినప్పటి నుంచి పంట ముగింపు దశ వరకు వారం, వారం క్షేత్ర స్థాయికి వెళ్లి పంటల్లో వచ్చే మార్పులు, చీడపీడలు తదితరాల గురించి వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించడం జరిగేది. పొలంబడి కార్యక్రమాలు రైతును శాస్త్రవేత్తగా తయారు చేస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. కొన్నేళ్లుగా జరుగుతున్న పొలంబడి కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం పక్కన పెట్టింది. అయితే మండలానికి ఒకటి చొప్పున గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ కింద పొలంబడి కార్యక్రమాలు మాత్రమే నిర్వహించేలా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంది. గ్యాప్ పద్ధతులతో పండించిన పంటలకు ఇండ్ గ్యాప్ ఆర్గానిక్ సర్టిఫికెట్లు కూడా జారీ అవుతాయి. గ్యాప్ పొలంబడులను కేవలం ఆహార పంటలైన వరి, జొన్న, కొర్ర, మొక్కజొన్న వేరుశనగ తదితర పంటల్లో మాత్రమే నిర్వహిస్తారు. గ్యాప్ పొలంబడులకు సంబంధించి ఈ నెల 19 నుంచి వెబెక్స్ ద్వారా ఏవోలు, ఏడీఏలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఆగని టీడీపీ విధ్వంసం


శిలాఫలకంపై రంగు పూసిన దృశ్యం

ఆళ్లగడ్డ: ఎన్నికల్లో విజయం తర్వాత టీడీపీ శ్రేణులు హద్దుమీరి ప్రవర్తిస్తున్నాయి. దశాబ్దాల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎన్నికల ఫలితాలు వెలువడిన నాడు మొదలైన దాడులు నెల రోజులుగా కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేస్తున్నా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో టీడీపీ శ్రేణులు మరింత రెచ్చిపోతున్నాయి. ఆళ్లగడ్డ మండలం ఓబులంపల్లె గ్రామంలో గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్‌ల భవనాలు నిర్మించింది. వీటిని ప్రారంభించే సమయంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలపై కొందరు వ్యక్తులు శుక్రవారం రాత్రి రంగు పూశారు. శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు గమనించి అధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ మేరకు ఉప సర్పంచ్ రవిరెడ్డి స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని ఓర్వలేకే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు.

డీఈఓ ఆఫీస్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

కర్నూలు సిటీ: జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో పని చేస్తున్న ఓ ఉద్యోగి చేతులు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. డి.రవికుమార్ డీఈఓ ఆఫీస్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఆఫీస్‌కు సక్రమంగా రావడం లేదని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారనే కారణంతో మొన్నటి దాకా బీ సెక్షన్‌లోని బీ-6 విభాగం నుంచి మార్పు చేసి, శనివారం కర్నూలు కింగ్ మార్కెట్ దగ్గరున్న హైస్కూల్‌కు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో సాయంత్రం డీఈఓ ఆఫీస్ ఆవరణలో ఉండే షటిల్ కోర్టు దగ్గర కూర్చొని తన వెంట తెచ్చుకున్న కత్తితో చేతులు కోసుకున్నాడు. అది చూసి అక్కడున్న వారు వారించినా వినిపించుకోకుండా అలాగే కోసుకున్నాడు. విషయం తెలిసి కొందరు ఆఫీస్ ఉద్యోగులు అక్కడికి వచ్చేసరికి బయటికి వెళ్లినట్లు చెబుతున్నారు. చేతులు కోసుకున్న ఫొటోలు ఉద్యోగుల వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేసి తనను ఎందుకు వేధిస్తున్నారని, తాను ఎవరికీ అన్యాయం చేయలేదని, తనపై ఎందుకు కక్ష కట్టారని, దయచేసి ఒకసారే నన్ను చంపాలని మెసేజీ పెట్టడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై డీఈఓ కె.శామ్యూల్‌ను వివరణ కోరగా రవి కుమార్ అనే ఉద్యోగి మద్యం సేవించి ఆఫీస్‌కు వస్తున్నారని, ఉద్యోగం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కింగ్ మార్కెట్ స్కూల్‌కి బదిలీ చేశామన్నారు. ఆఫీస్‌లో ఏ ఒక్కరూ ఆయనను వేధింపులకు గురి చేయడం లేదన్నారు.